న్యూస్ బాక్స్

జాబితా విడుదల

గర్మిళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆరోగ్యమిషన్ కింద మంచిర్యాల పరిధిలోని ఎన్‌హెచ్‌ఎం డీక్యూఏఎం 1 పోస్టుకు సంబంధించిన ప్రొవిజనల్ జాబితాను జిల్లా వైద్యాధికారి కార్యాలయం లో ప్రదర్శించామని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలుంటే ఈ నెల 13లోగా తెలియజేయాలని సూచించారు.

ఆర్‌పీపీటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీధరస్వామి

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్‌పీపీటీఎస్) మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీధర స్వామి నియమితులైనట్లు జిల్లా అధ్యక్షుడు కె సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఇంతకాలం ఆ పదవిలో కొన సాగిన తాడోజు సత్యనారాయణ అనివార్య కారణాల వల్ల విధుల నుంచి సస్పెన్షన్‌కు గురి కాగా ఆయన ఆ పదవికి రాజీనామా చేశారని చెప్పారు. దీంతో ఖాళీగా ఉన్న ఆ పదవికి శ్రీధరస్వామి పేరును రాష్ట్ర శాఖకు సూచించగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, నర్సింహులు ఆమోదించారని తెలిపారు.

రైతులు అధైర్యపడొద్దు

జన్నారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం వల్ల ధాన్యం తడిసిన రైతులు అధైర్యపడవద్దని సహకార సంఘం అధ్యక్షుడు అల్లం రవి అన్నారు. మంగళవారం పొనకల్ ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం ఆవరణలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.. వర్షం వల్ల ధాన్యం తడవడం బాధాకరమని చెప్పారు. ఎమ్మెల్యేతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు మంగళవారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రోజువారి వేతనాన్ని రూ.921 నుంచి రూ.1000కి పెంచడం హర్షణీయమని తెలిపారు కార్యక్రమంలో నర్సింగరావు, దుర్గయ్య, పద్మ, జమీల్, తిరుపతి, పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ఫోకస్

దండేపల్లి ఎస్సీ బాలుర వసతిగృహంలో చన్నీటి స్నానం చేస్తున్న విద్యార్థులు

సమస్యల వ్యథ

గురుకుల పాఠశాలల్లో వసతుల లేమితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. భోజనం నాణ్యతగా ఉండడం లేదని ఆవేదన చెందుతున్నారు. హీటర్లు పని చేయక పోవడంతో చన్నీళ్లతోనే స్నానాలు చేస్తూ ఇబ్బంది పడుతున్నారు. బెడ్‌షీట్లు సరిపడా లేక పోవడంతో చలికి వణికిపోతున్నారు.



చెన్నూరులో శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలుర వసతిగృహం

- గురుకుల పాఠశాలల్లో వసతుల లేమి
- నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ఆవేదన
- హీటర్లు పనిచేయక చన్నీటితో స్నానాలు
- కప్పుకునేందుకు బెడ్‌షీట్లు కరువు
- చలికి వణికిపోతున్న విద్యార్థులు

మంచిర్యాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో నెలకొన్న పరిస్థితుల కారణంగా విద్యార్థులు అవస్థలు పడాల్సి వస్తోంది. విద్యార్థుల సంక్షేమం గురించి అధికారులు పట్టించుకోవడం లేదని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందని, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు అనారోగ్యం పాలైనా పట్టించుకునేవారు లేక హాస్టల్ అంటేనే హడలిపోయే పరిస్థితులు ఉన్నాయి. వీటికి తోడు నాణ్యతలేని భోజనం, శుభ్రం చేయని మరుగు దొడ్లను చూస్తే విద్యార్థులకు చదవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. పారిశుధ్య కార్మికులు లేకపోవటంతో హాస్టల్ గదుల దుర్వాసన నుంచి వారికి విముక్తి దొరకడం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు గురుకులం చదువంటేనే కష్టంగా మారిందన్న చర్చ జరుగుతోంది.

● వసతుల లేమి..

మంచిర్యాల జిల్లాలో 8 బీసీ, 9 ఎస్సీ, 3 మైనార్టీ, 18 గిరిజన గురుకులాలు ఉన్నాయి. మొత్తం 38 గురుకులాల్లో 9 గురుకులాలు అద్దె భవనాల్లోనే ఉన్నాయి. ఒక బీసీ, నాలుగు ఎస్సీ గురుకులాలను సొంత భవనాల్లో నిర్వహిస్తున్నారు. 12 బీసీ గురుకులాల్లో 1,823 విద్యార్థులు, మూడు మైనార్టీల్లో 1,214 మంది, తొమ్మిది ఎస్సీ గురుకులాలో 2,380 మంది, గిరిజన గురుకులంలో 2,680 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చాలా వరకు అద్దె భవనాల్లోనే గురుకులాలను ఏర్పాటు చేశారు. వాటిలో చాలా చోట్ల కనీస సౌకర్యాలు లేకపోయినా లక్షల రూపాయల అద్దెలు చెల్లిస్తున్నారు. అయినప్పటికీ భవన యాజమానులు కనీస వసతులు కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భవనాల్లోనూ అంతకంటే దారుణ సమస్యలు ఉన్నాయి. మరుగు దొడ్లు, బాత్రూంలకు తలుపులు, కిటికీలు ఊడిపోయినా పట్టించుకోవడం లేదు. ఫలితంగా అసౌకర్యాల మధ్య విద్యార్థులు గురుకుల విద్యను అభ్యసించాల్సి వస్తోంది. సరిపడా..

మిగతా 7వ పేజీలో

నాసిరకంగా భోజనం..

హాస్టల్ విద్యార్థులకు చాలావరకు నాసిరకం భోజనం అందిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భోజనం అందించేందుకు ఒక్కో హాస్టల్లో ఒక్కో విధానాన్ని అమలు చేస్తున్నారు. బియ్యం, పాలు ప్రభుత్వమే సరఫరా చేస్తుండగా, కూరగాయలు, కోడిగుడ్లు, మాంసాహారం ఇతర నిత్యావసర సరుకులు సరఫరా చేందుకు వేర్వేరుగా కాంట్రాక్టు అప్పగించటం, వాటిపై సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో నాసిరకం సరుకులు హాస్టళ్లకు చేరుతున్నాయి. కొన్ని గురుకులాలకు ఒకే కాంట్రాక్టర్ నుంచి సరుకులు వస్తున్నట్లు సమాచారం. అయితే సరుకులన్నీ ఒకేసారి చేరవేస్తుండటంతో అవి స్టోర్ రూంలో ఉండి ముక్కి పోతున్నాయని, కొన్ని చోట్ల వాటినే వండి పెడుతుండటంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. నాసిరకం భోజనం, అపరిశుభ్ర వాతావరణం కారణంగా జిల్లాలోని పలు హాస్టళ్లలో విద్యార్థినిలు ఇటీవల అస్వస్థతకు కూడా గురయ్యారు. ఈ పరిస్థితులన్నీ హాస్టల్లో ఉండే విద్యార్థులకు సవాల్‌గా మారుతున్నాయి. హాస్టల్లో తినే ఆహారం పడకనో, ఇతరత్రా కారణాల వల్లనో విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు.



నెన్నెల మండలం కుష్ణపల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో ఉన్న పాడు బడిన బావి

బీజేపీలో ముఖేష్‌గౌడ్ చేరిక



ముఖేష్‌గౌడ్‌కు కండువా వేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మంచిర్యాల, డిసెంబరు 10 (ఆంధ్రప్రభ): మంచిర్యాల మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్ మంగళవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. సీనియర్ నాయకులు బెల్లంకొండ మురళి, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో ముఖేష్‌గౌడ్ పార్టీలో చేరగా కిషన్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడెం నగేష్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, నాయకులు జయరామారావు, రవీందర్ రావు, ఆదినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

రామకృష్ణపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఎంతైన ఉందని సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ అధ్యక్షుడు, మానవ హక్కుల కార్యకర్త డాక్టర్ రాజలింగు అన్నారు. మంగళవారం రామకృష్ణపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కులమతాలకు అతీతంగా మనుషులపై వివక్ష ఇప్పటికి కొనసాగుతుందని చెప్పారు. దేశ అత్యున్నత న్యాయస్థానం మానవ హక్కులు, కులమతాల విషయంలో పటిష్టమైన జీవోలను అందించిందని గుర్తు చేశారు. మహిళలు, బాలికలు, వృద్ధులపై ఇప్పటి హింస కొనసాగుతోందని, విద్య, వైద్యం విషయంలో అందరికి సమానంగా హక్కులు లభించడం లేదన్నారు. దీన్ని పాలకులు పట్టించుకోవాలని కోరారు. కుల వివక్ష నిర్మూలన కోసం మానవ హక్కుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ఆడెపు సురేందర్, కాగితపు సునీల్, నడిపెల్లి సునీల్, హనుమాండ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో గంగామోహన్

భీమిని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో గంగామోహన్, కేజీబీవీ బాలికల ఆశ్రమ పాఠశాలలో తహసీల్దార్ బికర్ణ దాస్ వేరువేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో వంట గదులు, స్టాక్ రూమ్, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం అధికారులు శుచి, రుచి చూసిన అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

తాండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ అన్నారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ ప్రారంభించారు. విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని చెప్పారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అంజయ్య, తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం, ఎంపీవో అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్ కుమార్, సౌజన్య, డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి

భీమిని, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి సీఎం కప్ పోటీలను గురువారం పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో గంగా మోహన్ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాతా, శిశువుకు వరం '102'

- 'అమ్మ'కు ఆత్మీయతతో.. బిడ్డకు ప్రేమతో
- జిల్లాలో అద్భుతంగా 102 అంబులెన్స్ సేవలు
- చికిత్స అనంతరం ఇంటివరకు చేరవేత
- 24గంటలు అందుబాటులో సేవలు



అంబులెన్స్‌లో గర్భిణులను ఆస్పత్రికి తీసుకువచ్చిన ఆశా వర్కర్లు

6

'సింగరేణి'లో మహిళా అధికారులు

- ఇప్పటి వరకు ఉద్యోగులుగానే పరిగణింపు
- ఇక నుంచి మైనింగ్‌లోనూ నియామకం
- మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)లుగా విధుల్లో చేరిక



మహిళా అధికారులు

7

రోగిని పట్టించుకోని వైద్యులు

గర్మిళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నెన్నెల గ్రామానికి చెందిన లింగంపల్లి చంద్రయ్య మంగళవారం గాయంతో మంచిర్యాల ఆస్పత్రికి రాగా వైద్యులు పట్టించుకోలేదని బాధితుడు చెప్పాడు. చంద్రయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి 11 గంటల సమయంలో ఆకస్మాత్తుగా కాలు జారి కింద పడగా పక్కటెముకలకు గాయమైంది. దీంతో అంబులెన్స్ ద్వారా బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఎక్స్‌రే తీసి బలమైన గాయం అయినందున మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కానింగ్ తీయించాలని రెఫర్ చేశారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు చంద్రయ్య ఆసుపత్రికి రాగా ఓపీ స్లిప్పు రాయించుకుని క్యూలో నిలబడ్డాడు. డ్యూటీలో ఉన్న డాక్టరు పట్టించుకోలేదని వాపోయాడు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మోహన్ డిమాండ్ చేశారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

బెల్లంపల్లిరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని శాంభవి ఐ విజన్ సెంటర్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి స్పందన లభించింది. 56 మందికి కంటి పరీక్షలు నిర్వహిం చారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ వంగల చక్రపాణి, పెద్ది రాజేందర్, కంటి పరీక్ష నిపుణులు రఘు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

మందమర్రిరూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సారంగపల్లి గ్రామానికి చెందిన శెట్టి వనితకు మం జూ రైన రూ. 19 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మంగళవారం బ్లాక్ కాం గ్రెస్ మండల అధ్యక్షుడు రాంచందర్, ఒడ్నాల కొమురయ్యలు అందజేశారు. కాంగ్రెస్ నాయకులు కమల్ మనోహర్‌రావు, రాయమల్లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడా పోటీలు

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా వర్క్స్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఈఆర్ క్లబ్‌లో వివిధ పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఏరియా సేవా అధ్యక్షురాలు మాలతి బహుమతులు అందజేసి అభినందించారు.

ఆశా కార్యకర్తల నిరసన

నస్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం ఇవ్వడానికి హైదరాబాద్‌కు వెళ్లిన బీఆర్‌టీయు యూనియన్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయాడానికి నిరసిస్తూ మంగళవారం నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వాణి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫేస్టోలో చెప్పిన ప్రకారం రూ. 18 వేల వేతనం పెంచుతామని చెప్పిందన్నారు. ఏడాది గడిచిన తర్వాత విజయోత్సవాల సందర్భంగా వినతి ఇవ్వడానికి నిన్న హైదరాబాద్ వెళ్లితే అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. దానిని నిరసనగా తాము మంగళవారం పీహెచ్‌సీల వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపామన్నారు. కార్యక్రమంలో సంధ్యారాణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో నిరసన తెలియజేస్తున్న ఆశా కార్యకర్తలు

హాజీపూర్: సమస్యలను పరిష్కరించాలని ధర్నా చేస్తుండగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ మంగళవారం హాజీపూర్ పీహె చ్‌సీ ఎదుట ఆశా కార్యకర్తలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వెంటనే సమస్యలను పరిష్కరిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సునీత, రాజేశ్వరి, రజిత, పద్మ, శ్యామల, మంగ, శాంతిసుధా, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆశా కార్యకర్తలు హైదరాబాద్ తరలి వెళ్లకుండా మంగళవారం దండేపల్లి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులతో తమ పోరాటం ఆపలేరని, దీన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.



మంచిర్యాలలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

గర్మిళ్ల/చెన్నూరు/బెల్లంపల్లి/రామకృష్ణాపూర్, డిసెం బరు 10 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని హమాలీవాడ లో గల తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేష్, నస్పూర్ పట్టణాధ్యక్షుడు సుబ్బన్న, కౌన్సిలర్లు శ్రీరాముల సుజాత మల్లేష్, హఫీజ్‌బేగంతాజుద్దీన్, బేర సత్యనారాయణ, అహ్మద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, పాల్గొన్నారు. చెన్నూరు పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్‌ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బెల్లంపల్లిలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, పట్టణాధ్యక్షుడు నూనేటి సత్యనారాయణ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ వాజిద్, ఎంపీపీ సుభాష్‌రావు పాల్గొన్నారు. రామకృష్ణపూర్ సూపర్ బజార్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభమెప్పుడు..?

జైపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిగుంట డీసీఎంఎస్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభి స్తారని రైతులు వేచిచూస్తున్నారు. గత రెండేళ్ల పాటు ఇక్కడి కొనుగోలు కేంద్రంలోనే రైతులు ధాన్యం విక్రయించారు. ప్రస్తుతం అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా ముదిగుం టలో మాత్రం కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదు. మండల పరిధిలోని ముదిగుంట డీసీఎంఎస్ కేంద్రం రెన్యూవల్‌కు కలెక్టర్, అదనపు కలెక్టర్, పౌర సరఫరాల అధికారి నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ మండడంలో రాజకీయ కారణాలతో కొందరు కొనుగోలు కేంద్రం రెన్యూవల్ కాకుండా అడ్డుకుంటున్నాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నవంబరు 25న జిల్లా డీసీఎం ఎస్ మేనేజర్, జిల్లా అదనపు కలెక్టర్‌ను కలిసి విన్నవించినా అధికారుల నుంచి స్పందన లేకుండా పోయిందని డీసీఎంఎస్ నిర్వాహకుడు చెబుతున్నారు. కొనుగోలు కేంద్రానికి అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదనే విషయంలో సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకపోడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



ముదిగుంటలో బయట ఆరబోసిన ధాన్యం

క్రైం కార్నర్

కుటుంబం ఆత్మహత్యాయత్నం

- పురుగుల మందు తాగిన భార్యాభర్త, కొడుకు, కూతురు
- కుమారుడు అప్పులు చేయడమే కారణం



మొండయ్య శ్రీదేవి దంపతులు, పిల్లలు శ్రీచైతన్య, శివప్రసాద్

తాండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుమారుడు అప్పులుచేసి స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టి నష్టపోవడంతో మండలంలోని కాసిపేట గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు పురుగుల మందు తాగి మంగళవారం ఉదయం ఆత్మహత్యాయత్నం చేశారు. గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపినవివరాల ప్రకారం...కాసిపేట గ్రామానికిచెందిన సముద్రాల మొండయ్య(60) కిరాణందుకాణం నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య శ్రీదేవి(50), కొడుకు శివప్రసాద్(30), కూతురు శ్రీచైతన్య(26) ఉన్నారు. కూతురు శ్రీచైతన్య మానసిక వికలాంగురాలు ఉన్నారు. కొంతకాలంగా కుమారుడు సముద్రాల శివప్రసాద్ స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టాడు. దీనికోసం గ్రామంలో తనకు తెలిసిన వారి దగ్గర సుమారు 35లక్షల నుంచి 40లక్షల రూపాయల వరకు అప్పులు తెచ్చాడు. కానీ లాభాలు రాక తీవ్రంగా నష్టపోయాడు. గ్రామంలో తీసుకున్న వారు అప్పులు చెల్లించమని అడగడంతో మనస్తాపం చెందారు. మంగళవారం తెల్లవారు జామున మొండయ్య, శ్రీదేవి, శివప్రసాద్, శ్రీచైతన్య కుటుంబమంతా కలిసి పురుగుల మందు సేవించారు. ఇదే విషయాన్ని పురుగుల మందు తాగారు. అనంతరం బావ మరిది రమేశ్‌కు మొండయ్య ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. అతను అక్కడికి చేరుకుని చుట్టు పక్కలవారి సాయంతో 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఇందులోశివప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై ఎస్సై కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా తమకు ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

కన్నెపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జజ్జరవెల్లి గ్రామానికి చెందిన కుట్రంగి పున్నం(31) మంగళవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం పున్నం పుట్టుకతోనే అంధుడు. దీనికి తోడు ఫిట్స్ వ్యాధితో బాధపడుతుండేవాడు. మద్యానికి బానిసై తరుచూ తల్లిదండ్రులను వేధిస్తుండేవాడు. మంగళవారం తల్లిదండ్రులను రూ. 5 వేలు ఇవ్వాలని అడగాడు. వారు లేవని చెప్పడంతో వారిని కొట్టి ఇంట్లో నుంచి వెళ్లిపోయి చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. పున్నం తండ్రి గట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గృహహింస కేసులో ఒకరికి జైలుశిక్ష

తాండూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గృహహింస కేసులో ఒకరికి ఏడాది జైలు జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో కిరణ్‌కుమార్ తెలిపారు. తాండూర్‌కు చెందిన జ్యోతికి 2009లో కాగజ్‌నగర్ గ్రామానికి చెందిన చిలుక తిరుపతి వివాహమైంది. ఆ సమయంలో ఒకటిన్నర తులాల బంగారం, రూ.4లక్షల నగదు, గృహఉపయోగ పరికరాలు కట్నంగా ఇచ్చారు. కొంతకాలం కాపురం సజావుగా కొనసాగింది. అనంతరం అదనపుకట్నం తీసుకురావాలని భర్త తిరుపతి, అత్త వీరమ్మ, ఆడపడుచులు వజ్రమ్మ,భాగ్యలక్ష్మి వేధించారు. దీంతో ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. పెద్దలు కలుగజేసుకుని నచ్చజెప్పారు. భర్త కుటుంబ సభ్యుల నుంచి వేధింపులు ఆపకపోవడంతో 8-2-2016న తాండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌హెచ్‌వో అశోక్‌కుమార్ చిలుక తిరుపతి, చిలుక వీరమ్మ, పరీష వజ్రమ్మ, చిలుక భాగ్యలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుత ఎస్‌హెచ్‌వో కిరణ్‌కుమార్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్, సాక్షులను పీపీ ముందు ప్రవేశపెట్టారు. తిరుపతిపై నేరం రుజువు కావడంతో బెల్లంపల్లి మేజిస్ట్రేట్ ముకేష్ ఏడాది సాధారణ జైలు శిక్ష , వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష

గర్మిళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఒక వ్యక్తికి రూ. 5 లక్షలకు రూ. 10 లక్షలు చెల్లించాలని, అలాగే ఏడాది జైలు శిక్షను విధిస్తూ మంగళవారం జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ నిరోషా తీర్పును వెలువరించారు. 2018లో బోడ హరినాయక్ బోధి రజితకు రూ. 5 లక్షలను అప్పుగా ఇచ్చాడు. ఈ మేరకు రజిత హరినాయక్‌కు ష్యూరిటీ కింద చెక్కును అందజేసింది. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోగా ష్యూరిటీకింద ఇచ్చిన చెక్కుకూడా బౌన్స్ అయ్యింది. దీంతో హరినాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చెక్‌బౌన్స్ కేసును నమోదు చేసిన పోలీసులు చార్జీషీటుదాఖలు చేసి మంగళవారం కోర్టులో హాజరు పూరిచారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి హరినాయక్ నుంచి తీసుకున్న రూ.5లక్షలకు గాను రూ.10లక్షలు చెల్లించాలని తీర్పునివ్వడంతో పాటు ఏడాది జైలు శిక్షను విధించారు.

గేదెపై పులి దాడి..

భయం గుప్పిట్లో ప్రజలు

సిర్పూరు(టి), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుడ్కిలి గ్రామంలో రైతు ఇంట్లో కట్టిఉంచిన గేదెపై మంగళవారం పులి దాడి చేసింది. గ్రామస్థులు, కుటుంబీకులు కేకలు వేయటంతో పులి అడవిలోకి వెళ్లి పోయింది. సోమవారం సాయంత్రం కూడా చీలపెల్లి గ్రామంలో పశువుల కాపారిని వెంటాడింది. పశువుల కాపారి చెట్టు ఎక్కడటంతో ప్రాణాపాయం తప్పింది. వరుసగా పులు దాడి చేస్తుండటంతో అంతా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఎస్సై ఎం కమలాకర్ ఆటోకు మైక్ అమర్చి అంతా అప్రమత్తంగా ఉండాలని వార్డుల వారీగా ప్రచారం చేస్తున్నారు.

పశు మాంసం తరలిస్తే చర్యలు

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పశు మాంసం తరలిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ ప్రమోద్‌రావ అన్నారు. పాత మంచిర్యాల బస్టాండ్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పశువు మాంసాన్ని భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పలు హిందూ సంఘాల నాయకులు మంగళవారం పట్టుకున్నారు. ఈ సందర్బంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ చాలాకాలంగా జగిత్యాల నుంచి అక్రమంగా ఆవు మాంసాన్ని తరలిస్తూ జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, మండీలకు తరలిసున్నట్లు సమాచారం ఉందని చెప్పారు. బాబా అనే వ్యక్తి ఆటో (టీజీ21 టీ0480)లో ఆవు మాంసాన్ని తరలిస్తుండగా పాత మంచిర్యాల బస్టాండ్ సమీపంలో 100 మంది కార్యకర్తలతో కలిసి అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించి అప్పగించామ న్నారు. ఈ విషయమై పట్టణ సీఐ ప్రమోద్‌రావును వివరణ కోరగా మాంసం తరలిస్తున్న ఆటోను, వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

కాసిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గట్రావుపల్లికి చెందిన మడావి జంగును దొంగతనం కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు దేవాపూర్ ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 8న గట్రావుపల్లికి చెందిన సిడాం పాండు పని నిమిత్తం ఇంటికి తాళం వేసి తిర్యాణికి వెళ్లాడు. ఇది గమనించిన ఇదే గ్రామానికి చెందిన మడావి జంగు తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న 6.5 గ్రాముల బంగారు ఆభరణాలు, 35 గ్రాముల వెండి కడియం దొంగలించాడు. 9న ఉదయం ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉండడం బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఉదయం బంగారు ఆభరణాలు అమ్మేందుకు మంచిర్యాలకు వెళ్తూ దేవాపూర్ బస్టాండ్ వద్ద బస్సు కోసం చూస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. బంగారు, వెండి ఆభరణాలు దొరికాయన్నారు. పట్టుకున్న వాటి విలువ రూ. 49 వేలు ఉంటుందని తెలిపారు.

మాతా, శిశువుకు వరం '102'

- 'అమ్మ'కు ఆత్మీయతతో.. బిడ్డకు ప్రేమతో
- జిల్లాలో అద్భుతంగా 102 అంబులెన్స్ సేవలు
- చికిత్స అనంతరం ఇంటివరకు చేరవేత
- 24 గంటలు అందుబాటులో సేవలు

తిర్యాణి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 102 వాహనసేవలు బాలింతలకు వరంలా మారాయని చెప్పవచ్చు. 'అమ్మకు అత్మీయతతో బిడ్డకు ప్రేమతో' అనే నినాదంతో ప్రభుత్వం 102వాహనాన్ని ప్రారంభించింది. ఈ అంబులన్స్‌లో జీపీఎస్ సిస్టంను కలిగి ఉండి అవసరమైన వైద్య పరికరాలు అమర్చబడి ఉంటాయి. ఈ అంబులెన్స్ గర్భిణీ స్త్రీలు, నవజాత శిశువులు, తల్లులను ఆస్పత్రి నుంచి ఇంటికి, ఇంటి నుంచి ఆస్పత్రికి తరలించడానికి రోజులో 24 గంటలు పనిచేస్తూ ఉచితంగా సేవలు అందిస్తుంది. ఈ వాహనాన్ని ఎంతో మంది బాలింతలు రవాణా సౌకర్యానికి ఉపయోగించుకుంటున్నారు. 102వాహనంలో పైసా ఖర్చు లేకుండా ఉచితంగా సేవ చేస్తూ బాలింతలను ప్రసూతి రోజు వరకు వారి గ్రామాలకు వెళ్లి తీసుకువస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పిస్తున్నారు. అవసరం ఉన్న వారికి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి మళ్లీ తిరిగి వారి వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నారు. 102 వాహనం బాలింతలకు ఎంతగానో ఉపయోగపడుతోందని గర్బిణులు,వారి బంధువులు పేర్కొంటున్నారు. గర్బిణులను, ప్రసవ అనంతరం తల్లీ,బిడ్డను



102 అంబులెన్స్

వారి ఇంటికి తీసుకు వెళ్లడానికి 102 వాహనం సౌకర్యాన్ని ఎంతగానో ఉపయోగించుకుంటున్నారు.

గర్భిణీ మొదటి నెల నుంచి గ్రామాల్లో ఉన్నటువంటి ఆశా కార్యకర్తల ద్వారా జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వ ఆసుపత్రులు, అలాగే ఆసిఫాబాద్, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్లి రక్త పరీక్షలు, స్కానింగ్, పరీక్షలు చేయించి వారి వారి గ్రామాలకు తీసుకెళ్లారు. అంతే కాకుండా 102సేవలు 24గంటలు అందుబాటులో ఉంటాయి. 102సేవలు గర్బిణులతో పాటు బిడ్డకు వ్యాక్సినేషన్ ఇప్పించడం, ప్రసవ అనంతరం ఇంటికి చేర్చుట ఈసేవలు అందరు ఉపయోగించుకోవాలని తిర్యాణి వైద్యాధికారి కృష్ణ కోరారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

● ప్రమాదకరంగా మూల మలుపులు ● తరుచూ ప్రమాదాలు ● సూచికలు సైతం ఏర్పాటు చేయని అధికారులు

కాగజ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్-పెంచికల్‌పేట వెళ్లేమార్గంలో మూలమలుపుతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వదిలేయటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగజ్‌నగర్‌కు కొద్ది దూరంలో ఉన్న ఈసుగాం శివమల్లన్న ఆలయం సమీపంలో ఒకమూలమలుపు ప్రమాదకరంగా ఉంది. అలాగే ఈసుగాం గ్రామ శివారులో ఉన్న మూలమలుపు ఉంది. కాగజ్‌నగర్-పెంచికల్‌పేట మార్గంలో కూడా మరిన్ని మూలమలుపు అతి ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే కాగజ్‌నగర్-దహెగాం మార్గంలో 22మూలమలుపులున్నాయి. ఏటాప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే కాగజ్‌నగర్-కడంబా అటవీప్రాంతంలో కూడా ఇదే సమస్య ఉంది. ఈమార్గంలో ఏడాదికినీసం ఐదారు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని ప్రమాదాల్లో పలువురు మృత్యువాత కూడా పడినసందర్భాలు కూడా ఉన్నాయి. అధికారులు వెంటనే స్పందించి కనీసం మూల మలుపుల వద్ద సూచికలైన ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు. స్పీడ్ బ్రేకర్లు కూడా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండు చేస్తున్నారు.

వాంకిడి: మండలకేంద్రం నుంచి దాబా గ్రామానికి వెళ్లేరహదారిపై ఎస్సీ వసతి గృహం ఎదురుగా ఉన్న మూలమలుపు ప్రమాదకరంగా తయారైంది. ప్రతిరోజు ఈ దారిగుండా ప్రజలు, విద్యార్థులు రాకపోకలు చేస్తుంటారు. నిత్యంద్విచక్ర వాహనాలు, ఆటోలు పదులసంఖ్యలో వస్తూ పోతుంటాయి. మూలమలుపు వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఈమూలమలుపువద్ద అనేక రోడ్డు ప్రమదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. చెట్ల కొమ్మలు కూడా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు, ప్రజలు కనిపించక ప్రమా దాలు జరుగుతున్నాయని వాహనచోదకులు పేర్కొంటున్నారు. పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో ఎప్పుడు ఏంజరు గుందో అని విద్యార్థుల తల్లిదండ్రులు భయందోళనకు గురవుతున్నారు. గ్రామపంచాయతీ అధికారులు మూల మలుపు వద్ద చెట్లకొమ్మలను తొలగించి రోడ్డుప్ర మాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు, విద్యార్థుల తల్లి దండ్రులు కోరుతున్నారు.



వాంకిడి: ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు



కాగజ్‌నగర్: ఈసుగాం వద్ద ఉన్న మూలమలుపు



కాగజ్‌నగర్: శివమల్లన్న ఆలయ సమీపంలో ఉన్న మూలమలుపు

తొలి ప్రయత్నంలోనే లెక్చరర్ ఉద్యోగం



ప్రవళిక

కాగజ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ముత్యంవార్ ప్రవళిక ఒకే ప్రయత్నంలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించారు. టీజీపీస్సీ ప్రకటించిన జూనియర్ లెక్చరర్ పరీక్ష ఫలితాల్లో ఆమె ఉద్యోగం సాధించారు. ప్రవళిక ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్దనే యూట్యూబ్‌లో తరగతులు వింటూ పుస్తకాలు చదివారు. ఈ సందర్భంగా ఆమె తన భర్త, అత్తయ్య కుటుంబసభ్యుల సహకారంతోనే ఈ ఉద్యోగం సాధించినట్లు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ చెన్నూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన లభించింది. చెన్నూరు, కోటపల్లి, భీమారం, వేమనపల్లి మండలాలకు చెందిన 350మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. 260 మందికి కంటి ఆపరేషన్‌లు అవసరం ఉండగా మొదటి విడతలో 40మందిని కరీంనగర్‌లోని రేకుర్తి ఆసుపత్రికి తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ గవర్నర్ సురేష్, వైస్‌చైర్మన్ భాస్కర్, మధుకర్, జోన్‌చైర్‌పర్సన్ ఎడ్లశ్రీనివాస్, మోదుగపురం వెంకటేశ్వర్, శ్రీనివాస్, క్యాంపు చైర్‌పర్సన్ రత్నభాస్కర్‌రెడ్డి, కోచైర్మన్ సత్యనారాయణ, కార్యదర్శి వెంకట నర్సయ్య, కోశాధికారి నిమ్మల సాగర్, ఆశా కార్యకర్తలు, సత్యసాయి, విశాఖ తరంగిణి చెన్నూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జాడి తిరుపతి పాల్గొన్నారు.

విధులకు గైర్హాజరు కావద్దు

రెబ్బెన, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విధులకు గైర్హాజరుకాకుండా ఉద్యోగంలో గుర్తింపు తెచ్చుకోవాలని బెల్లంపల్లిఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీఎంకార్యాలయం ఆవరణలో మెడికల్‌ఇన్వాలిడెట్ అయిన ఉద్యోగుల ఏడుగురు వారసులకు ఉద్యోగ నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం రాజమల్లు, డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహరా, పర్సనల్‌మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.



రక్షణే ప్రథమం.. రక్షణే ఎల్లప్పుడూ



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న జీఎం

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రక్షణేప్రథమం.. రక్షణే ఎల్లప్పుడూ అని శ్రీరాంపూర్ ఏరియాజీఎం ఎల్‌వి సూర్యనారాయణ, రక్షణ వారోత్సవాల కమిటీకన్వీనర్, కార్పొరేట్ జీఎం హబీబ్‌హుస్సేన్ అన్నారు. 55వరక్షణ వారోత్సవాలను మంగళవారం ఆర్‌కే7 గనిపై ప్రారంభించారు. ఉద్యోగులరక్షణకు ప్రతి యేటావారోత్సవాలు నిర్వహిస్తున్నట్లుచెప్పారు. అనంతరం 2022లో ఓవరాల్ గ్రౌండ్ మైన్స్ గ్రూప్-1 విభాగంలో ద్వితీయ బహుమతి పొందినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ జీఎం(రక్షణ) రఘుకుమార్, గ్రూప్ ఏజెంట్ రాజేందర్, గని మేనేజర్ తిరుపతి, రక్షణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తక్షణ వైద్య సేవలకు అంబులెన్సులు

సింగరేణి ఉద్యోగులకు అత్యవసర సమయంలో తక్షణ వైద్య సేవలకోసం అంబులెన్సులు ప్రారంభిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియాజీఎం ఎల్‌వి సూర్యనారాయణ అన్నారు. 20లక్షల వ్యయంగల రెండు నూతనఅంబులెన్సులను ఆయనమంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌వోటుజీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా, తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి బీసీ ఉద్యోగుల సంక్షేమసంఘం సమావేశం సీసీసీ-నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ముఖ్యఅతిథులుగా ముచ్చె. సమ్మయ్య, పేరం రమేష్, మోత్కూరి కొమురయ్య, బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య, పి. రమేష్, వి కుమారస్వామి హాజరయ్యారు. త్వరలో జరగబోయే బీసీ మహాసభ విజయవంతానికి కృషిచేయాలని, కమిటీలను నియమించి ఏరియాస్థాయిలో అందరికి వివిధబాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. అనంతరం టెక్నీషియన్ నుంచి సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందిన పేరం రమేష్, పొగాకు రమేష్‌లను సంఘం పక్షాన సన్మానించారు.

గైర్హాజరు కార్మికులు విధులకు హాజరు కండి

మందమర్రిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికులు విధులకు హాజరు కావాలని వృత్తిపరంగా ఏమైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కేకే5 గని వద్ద ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో అధిక శాతం కారుణ్య నియామకాల ద్వారా యువ చేరారన్నారు. వారిపైనే సింగరేణి భవిష్యత్ ఆధారపడి ఉందని మర్చిపోవద్దన్నారు. విధులకు గైర్హాజరైతే నాగాల పేరిట ఉద్యోగం కోల్పోతే అట్టి కుటుంబాలు ఇబ్బందులు పడతాయనే విషయాన్ని గైర్హాజరవుతున్న ఉద్యోగులు గమనించాలన్నారు. సమావేశంలో నాయకులు కంది శ్రీనివాస్, గాండ్లసంపత్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఏరియాకు తలమానికం కేకే5 గని

మందమర్రిటౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏరియాలోని కేకే5 గని మందమర్రికి తలమానికం. ఉత్పత్తి ఉత్పాదకత, రక్షణలో కూడా ఈ గని ముందుంది. ఇందులో పని చేస్తున్న కార్మికులు, అధికారులు కలిసికట్టుగా ఉత్పత్తిలో రికార్డుల పరంపర కొనసాగిస్తున్నారు. 1962లో ఈ గని ప్రారంభమైంది. ఆరు దశాబ్దాలుగా ఈ గని అద్భుత ఫలితాలు సాధించిందంటే అతిశయోక్తికాదు. పట్టణంలోని నడి బొడ్డునఉన్న ఈగనికి ప్రత్యేకతలున్నాయి. ఈ గనిలో దాదాపు 850పైగా కార్మికులు పని చేస్తున్నారు. ఈగని 2000సంవత్సరంలో జాతీయరక్షణ అవార్డును సాధించింది. 2001 సంవత్సరంలో కూడా రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకుంది. ఇప్పటివరకు 2011,-2021లో కూడాఏరియా ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకుంది. గని చుట్టూ వేలాది మొక్కలు నాటారు. గని ప్రాంగణంలో 7దశాబ్దాలు దాటిన చెట్లు గనిపై పచ్చదనం పరుచుకున్నాయి. గని సమీపంలో మ్యాగ్జిన్ వెనుక నాలుగు ఎకరాల స్థలంలో మంకీ ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. బలరాం వనంగా దానికి నామకరణం చేశారు. దాదాపు వెయ్యి మొక్కలను గంటలో నాటి రికార్డును సృష్టించారు. సీఎండీ ఈ ప్రాంతానికి వచ్చినపుడల్లా తాను గనిపై ఏర్పాటు చేసిన మంకీ ఫుడ్ కోర్టును సందర్శిస్తుంటారు. ఈ గని కార్మికులపై ప్రత్యేక ప్రేమ చూపుతుంటారు.

ఉత్పత్తి, రక్షణలో కేకే-5గనికి సాటి లేదు: జీఎం



ఏరియాలోని కేకే5గని ఉత్పత్తి, ఉత్పాదకతతో పాటు రక్షణలో కూడా ముందు నిలిచింది. ఈ గని అధికారులు, కార్మికులు రక్షణ సూత్రాలు పాటిస్తూ అభివృద్ధికి పాటుపడుతున్నారు. రెండు జాతీయ అవార్డులను ఈ గని సాధించగలిగింది. రక్షణ వారోత్సవాల్లో వివిధ విభాగాల్లో అవార్డులు సాధించింది. ఈగని కార్మికులు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు రక్షణకు తీసుకుంటున్న చర్యలు భేష్. ప్రతీ ఆర్థిక సంవత్సరం వందకు వందశాతం ఉత్పత్తి సాధించడం ఈ గని అధికారులు, కార్మికులకే చెందుతుంది.

ఉత్పత్తి ఉత్పాదక లక్ష్యాలను పెంచాలి: జీఎం

మందమర్రి టౌన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తి, ఉత్పాదక లక్ష్యాలను పెంచాలని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. మంగళవారం కేకే5గనిపై నిర్వహించిన మల్టీడిపార్టుమెంట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో కేకే5గని వందకు వందశాతం ఉత్పత్తిసాధిస్తూ ఏరియాలో ముందుందని పేర్కొన్నారు. రక్షణ విభాగంలో కూడా మొదటి స్థానంలో ఉందన్నారు. ఈ సందర్బంగా పలువురు ఉద్యోగులను ప్రశ్నలు అడగగా జవాబు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీచైర్మన్, ఎస్‌వోటూజీఎం విజయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల భాగస్వామ్యంతోనే ప్రమాదరహిత గనులు



మాట్లాడుతున్న సేఫ్టీ కన్వీనర్ కార్పొరేట్ జీఎం శ్రీనివాసరావు

కాసిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్మికుల భాగస్వామ్యంతోనే ప్రమాద రహిత గనులుగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని సేఫ్టీ కన్వీనర్, కార్పొరేట్ జీఎం శ్రీనివాసరావు అన్నారు. మందమర్రి డివిజన్‌పరిధిలోని కాసిపేట 1వగనిలో మంగళవారం నిర్వహించిన 55వరక్షణ వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బొగ్గుబావుల్లో పనిచేసే ప్రతి కార్మికుడు రక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ యేడాది గనుల్లో తక్కువ ప్రమాదాలు నమోదయ్యాయని తెలిపారు. ఇందుకు కృషి చేసిన అధికారులను, కార్మికులను ఆయన అభినందించారు. అనంతరం 54వ వార్షిక రక్షణవారోత్సవాల్లో గెలుపొందిన సేఫ్టీ కమిటీ పెర్ఫామెన్స్, బెస్ట్ ఎన్విరాన్‌మెంట్ మైన్ ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేకే గ్రూపు ఏజెంటు రాందాస్, డిప్యూటీజీఎం శ్రీనివాస్, ఏరియా సేఫ్టీ అధికారి రవీందర్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

స్ర్కాప్‌ను పట్టుకున్న సింగరేణి ఎస్‌అండ్‌పీసీ

రెబ్బెన, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణికి చెందిన చోరీకి గురైన స్ర్కాప్.. స్ర్కాప్ దుకాణానికి చేరుకోగా సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది మంగళవారం పట్టుకున్నారు. ఏరియా సెక్యూరిటీ అధికారి ఉమాకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది మంచిర్యాల జిల్లా బోయపల్లిలోని స్ర్కాప్ దుకాణాన్ని తనిఖీ నిర్వహించారు. నిల్వ ఉంచిన 170కిలోల కేబుల్ నుంచి తొలంగించిన కాపర్ తీగ, 5క్వింటాళ్ల ఇనుప సామగ్రిని రికవరీ చేశారు. వీటి విలువ ఒక లక్ష ఉంటుందన్నారు. తనిఖీల్లో జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, శంకర్, వెంకటేష్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



స్ర్కాప్‌ను స్వాధీనం చేసుకున్న అధికారులు

సేవా సమితితో యువతకు ఉపాధి

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవాసమితి ద్వారా వృత్తిశిక్షణ ఇచ్చి యువతకు ఉపాధికల్పిస్తున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షురాలు మాలతి అన్నారు. సీఈఆర్ క్లబ్‌లో ఆవిర్భావ వేడుకలు నిర్వహించగా, ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం 2023-24ఆర్థిక సంవత్సరంలో వివిధ వృత్తికోర్సుల్లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందించారు. వివిధ కోర్సుల్లో నూతన శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సీనియర్ పీవో కాంతారావు, ఏఐటీయూసీ బ్రాంచ్‌ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

రెబ్బెన, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిర్దేశించిన లక్ష్యాల సాధనకు అధికారులకు కృషిచేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో ఆయన మాట్లాడారు. సంస్థ అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యచరణపై ఉద్యోగుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీవో మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజనీర్ భీంరావు జాడే, పర్సనల్‌మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి పాల్గొన్నారు.

సమస్యల వ్యథ

5వ పేజీ తరువాయి..

మరుగు దొడ్లు, తాగునీరు, స్నానాలకు నీరులేక అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులను అన్ని గురుకులాల్లో నియమించలేదు. కొన్ని చోట్ల గ్రామ పంచాయతీ కార్మికులనే వినియోగిస్తున్నారు. దీంతో హాస్టళ్ళు అపరిశుభ్రతకు కేరాఫ్‌గా మారుతున్నాయి. చలికాలం మొదలైనా విద్యార్థులందరికీ దుప్పట్లు అందలేదు. దీంతో చలికాలంలో గజగజ వణుకుతూ పడుకోవలసిన పరిస్థితులు దాపురించాయి. కొంత మంది విద్యార్థులు ఇళ్ళ నుంచి దుప్పట్లు తెచ్చుకుంటున్నారు. చలి తీవ్రత తట్టుకోలేక జలుబు, జ్వరం వంటి అనారోగ్యాలకు గురవుతున్నారు. స్నానానికి వేడి నీటి సౌకర్యం ఉన్నప్పటికీ హీటర్లు పనిచేయక చన్నీటి స్నానాలు ఆచరిస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

హాస్టళ్ల పర్యవేక్షణ ప్రధానంగా వార్డెన్లు, హెచ్‌ఎంలపైనే ఉంటుంది. బీసీ గురుకులాలను పర్యవేక్షించేందుకు ఒక నోడల్ అధికారిని మాత్రమే ప్రభుత్వం నియమించింది. ఒక్కరు ఎన్ని గురుకులాలను పర్యవేక్షించగలరనే ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. సంక్షేమశాఖ అధికారులకు గురు కులాలపై అధికారం లేకపోవటంతో పర్యవేక్షణ కరువవుతోంది. దీంతో హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్స్ పైనే భారం పడుతోంది. చాలా చోట్ల వారు కూడా చేతులెత్తేస్తుండటంతో గురుకులాలు సమస్యలకు నిలయంగా మారుతున్నాయి.

సమస్యలు ఇలా..

దండేపల్లి మండలంలోని బాలికల హాస్టల్‌లో 275 మంది విద్యనభ్యసిస్తుండగా పాఠశాలలో డ్రైనేజీ సౌకర్యం లేదు. ప్రహరీగోడను నిర్మించక పోవడంతో రాత్రివేళల్లో విద్యార్థినులు భయాం దోళనకు గురవుతన్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న జ్యోతిబాఫూలే బాలికల, బాలుర పాఠశాలకు కిటికీలు, తలుపులు లేక పోవడంతో చలితీవ్రతను తట్టుకోలేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

- లక్సెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి బీసీ హాస్టల్లోని విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వక పోవడంతో చలితీవ్రతను తట్టుకోలేక పోతున్నారు.
- బెల్లంపల్లి, చెన్నూరు,మంచిర్యాలలో 3 మైనార్టీ బీసీ గురుకుల పాఠశాలలు అద్దెభవనంలో నిర్వహిస్తున్నారు. భోజనం రుచిగా ఉండడం లేదని, ముద్ద అవుతుందని దీంతో సరిగా తినడంలేదని చెబుతున్నారు. కొత్తబియ్యం కావడంతో మరో నెలరోజులపాటు అడ్జస్టు కావాలంటూ అధికారులు చెబుతున్నారని విద్యార్థులు తెలిపారు.
- కన్నెపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాల ఉన్నది. పాఠశాలల 197 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం లేదు. ఆర్వో ప్లాంట్ లేదు. పాఠశాలకు కంపౌండ్ వాల్ లేక ఇబ్బంది పడుతున్నారు.
- వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామంలో కస్తూర్బా విద్యాలయంలో స్నానానికి వేడి నీటి సౌకర్యం లేదు. గిరిజన విద్యార్థులు చలికి గజ గజ వణుకుతూ చన్నీళ్ల స్నానం చేస్తున్నారు. విద్యార్థులు పడుకునేందుకు మంచాలు లేకపోవడంతో నేల పైననే పడుకుంటున్నారు. చలికాలం కావడంతో విద్యార్థులు ఉదయం వేళ చన్నీటి స్నానం అంటేనే జంకుతున్నారు.
- నెన్నెల మండలం కుష్ణపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల భవనం పాత ప్రభుత్వ కార్యాలయం ఆవరణలో కొనసాగుతోంది. అందులో పడుబడ్డ బావి ఉండడంతో మురుగు నీటితో దోమలు పెరిగి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటులో అభ్యంతరాలు తెలియజేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో గుర్తించిన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుతో ఏమైనా అభ్యంతరాలుంటే లిఖిత పూర్వకంగా తెలియజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతిలో కలిసి ఎన్నికల అధికారులు, రాజీకయ పార్టీల ప్రతినిదులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలోని 311 గ్రామపంచాయతీల్లో 2,730 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాల్ల 4,57,157 మంది జనాభా ఉండగా 3,84,746 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాశాలలు, గ్రామపంచాయతీలు,అంగన్‌వాడీ కేంద్రాల్లో 2,574 పోలింగ్ కేంద్రాలు, 141 తాత్కాలిక, 15 ప్రైవేటు పోలింగ్ కేంద్రాలను గుర్తించామని చెప్పారు. ఎంపీడీవోలు ప్రజాప్రతినిదులతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ నెల 12లోగా ఏమైనా అభ్యంతరాలుంటే స్వీకరించాలన్నారు. 13న అభ్యంతరాలు,ఫిర్యాదులను పరిష్కరించనున్నామని, 17న తుది పోలింగ్ కేంద్రాల జాబితా ప్రచురించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏజెన్సీ భూములను కాపాడాలి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

కాసిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లోని భూములను కాపాడాలనిమంగళవారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్, తహసీల్దార్ భోజన్నలకు ఆదివాసీ సంఘాల నాయకులు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు ఆడె జంగు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న భూములను ప్రభుత్వ అధికారులు ఎలాంటి గ్రామసభలు లేకుండానే అటవీ శాఖకు భూములను అప్పగించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఎజెన్సీ ప్రాంతాల్లో పీసా చ ట్టం, 1/70 యాక్టును అనుసరించి గ్రామసభలు నిర్వహించిన అనంతరం భూములపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్ర మంలో గిరిజన సంఘాల నాయకులు మల్లేష్, రాజన్న, బాలరాజు, కనకరాజు, పెంద్రం హన్మంతు, రాందాస్, రొడ్డ మల్లేష్, వెంకటేష్, చంద్రయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కోనోకార్పస్ చెట్ల తొలగింపు

బెల్లంపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బజార్ ఏరియాలో, రైల్వేస్టేషన్ ముందు డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన కోనోకార్పస్ చెట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తొలగించారు. చెట్లతో అనారోగ్య, శ్వాసకోశ సమస్యలు ఏర్పడుతాయని, దీంతో వీటిని తొలగించామని తెలిపారు.

సింగరేణిలో మహిళా అధికారులు

- ఇప్పటి వరకు ఉద్యోగులుగానే పరిగణింపు
- ఇక నుంచి మైనింగ్‌లోనూ నియామకం
- మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)లుగా విధుల్లో చేరిక



నేటి ఆధునిక సమాజంలో మహిళ ఒక పైలట్‌గా, అంతరిక్ష వ్యోమగామిగా, డాక్టర్‌గా, పోలీసుగా, రాజకీయ నాయకురాలిగా ఇలా అన్ని రంగాల్లో రాణిస్తోంది. మహిళలు మగవారికి దీటుగా 'సరిలేరు స్త్రీకెవ్వరు' అన్నట్లుగా దూసుకెళుతున్నారు. అందుకే సింగరేణి సంస్థ పురుషులకే పరిమితమనుకున్న మైనింగ్ రంగంలో సైతం అవకాశం ఉన్న చోట మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తూ ప్రోత్సహిస్తోంది.

శ్రీరాంపూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో నవశకం మొదలైంది. ఇప్పటి వరకు యాజమాన్యం మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పించగా ఇక నుంచి మహిళా అధికారులు(మేనేజ్‌మెంట్ ట్రైనీ-మైనింగ్) సంస్థలో పనిచే సేందుకు అంతా సిద్ధమైంది. శ్రీరాంపూర్ ఏరియాకు 22 మంది ఎంటీ(మైనింగ్) అధికారులను కేటాయించగా, ఇందులో ముగ్గురు మహిళా అధికారులు ఉన్నారు. వారు సోమవారం విధుల్లో చేరారు.



ఎంటీ(మైనింగ్) అధికారులు, సర్కిల్‌లో మహిళలు

బ్రిటీష్ కాలంలో..

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సింగరేణి గ్రామంలో (ప్రస్తుతం ఇల్లెందు) 1889లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైంది. అప్పట్లో గునపాలతో బొగ్గును తొలిచి పైకి తీసుకొచ్చేవారు. బొగ్గు ఉత్పత్తిలో మహిళలు, బాలబాలికలు పాలుపంచుకునేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1947లో మహిళలను భూగర్భంలో పనిచేయకుండా నిషేధం విధిస్తూ అప్పటి భారత ప్రభుత్వం చట్టం తీసుకొచ్చింది. ఆ తరువాత అవసరాలకు అనుగుణంగా మహిళలు సైతం గనుల్లో దిగి పనులు చేయవచ్చని గత చట్టాన్ని సవరించారు. దీంతో వారికి అవకాశాలు ఏర్పడ్డాయి.

నేరుగా ఉద్యోగావకాశం..

ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం ఈ ఏడాది మే నెలలో సింగరేణి నోటిఫికేషన్ ఇచ్చింది. పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్)గా 88 మంది ఉద్యోగాలు సాధించారు. ఇందులో 28 మంది మహిళలు ఉన్నారు. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. వీరిలో కొత్తగూడెం ఏరియాలో ఆరుగు రు, భూపాలపల్లి ఏరియాలో ఆరు గురు, ఆర్‌జీ-2 ఏరియాలో ఆరుగురు, ఆర్‌జీ-1 ఏరియాలో ఐదుగురు, శ్రీరాంపూర్ ఏరియాలో ముగ్గురు, మణుగూరు ఏరియాలో ఇద్దరు సోమవారం జాయిన్ అయ్యారు.

ఏడాది శిక్షణలోనే..

ఉద్యోగంలో చేరిన వారికి రెండు వారాల పాటు ఓరియెంటేషన్ ట్రైనింగ్ ఉంటుంది. మొదటి మూడు రోజులు రక్షణపై స్థానిక వృత్తి శిక్షణ కేంద్రాల్లో అవగాహన కల్పిస్తారు. దీంతో కలుపుకొని రెండు వారాల పాటు వివిధ విభాగాలపై అవగాహన, మరో రెండు వారాలు పని ప్రదేశాల్లో శిక్షణ ఉంటుంది. నూతన ట్రైనీలు నెలకోమారు తమ శిక్షణకు సంబంధించిన రిపోర్టును వీటీసీలలో సమర్పించాలి. ఆరు నెలలకు ఫేజ్-1, ఒక సంవత్సరానికి ఫేజ్-2 పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తదుపరి వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తారు.

గతంలో కుటుంబ పెద్ద చనిపోతే..

సింగరేణిలో మహిళలకు గతంలో నేరుగా ఉద్యోగాలిచ్చే అవకాశం లేదు. కేవలం వారి కుటుంబ పెద్ద చనిపోతే ఉద్యోగం ఇచ్చేవారు. ఆ తరువాత 2018 నుంచి కారుణ్య విధానంలో నియామకాలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు కంపెనీ వ్యాప్తంగా సుమారు 1530 మందికి పైగా మహిళలు పనిచేస్తున్నారు. కాగా కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగ అవకాశం పొందిన మహిళలు కార్యాలయాలు, విభాగాల్లో వివిధ పనులు చేస్తున్నారు. కానీ గనుల్లోకి దిగడం లేదు. గతేడాది జూన్ 24న అప్పటి వరకు ఉన్న సర్ఫేస్ పదం తొలగించి అండర్ గ్రౌండ్ అని సర్క్యులర్ జారీ చేయడంతో మహిళా ఉద్యోగులు అండర్‌గ్రౌండ్‌లోకి దిగక తప్పదా అని చర్చ జరిగింది. ఆ తరువాత ఆ విషయం మరుగున పడింది.

శిక్షణ పొందిన తరువాతే విధులు

కల్లూరి వెంకట రామారావు, మేనేజర్, శ్రీరాంపూర్ వీటీసీ



సింగరేణిలో ఎవరు నియామకమైనా ముందుగా వృత్తి శిక్షణ కేంద్రం (వీటీసీ) ద్వారా శిక్షణ పొందాల్సి ఉంటుంది. ఇక్కడ బొగ్గు గనులు, వృత్తి సంబంధిత పనులు, విధులు, నిబంధనలు, నియమాలు, రక్షణ, తదితర విషయాలపై థియరీ నేర్చుకుంటారు. అనంతరం వృత్తి సంబంధిత పనులను గనుల్లోకి వెళ్లి తెలుసుకుంటారు. నూతనంగా మైనింగ్ అధికారుల బ్యాచ్ రావడం అభినందనీయం.

కష్టాలు ఎదుర్కొని..



ఈమె పేరు మాడిశెట్టి సాయిప్రత్యూష. జగిత్యాల జిల్లా డబ్బు తిమ్మయ్యపల్లి గ్రామం. తండ్రి టైలర్‌గా పనిచేసేవాడు. సాయిప్రత్యూషకు నాలుగేళ్ల వయసున్నపుడే తండ్రి చనిపోయాడు. తల్లి రేణుక టైలరింగ్ పనిచేస్తూ ఆమెతో పాటు చెల్లెలు ప్రియాంకను చదివించింది. నాచుపల్లిలో పాఠశాల విద్యాభ్యాసం, కరీంనగర్‌లో ఇంటర్మీడియెట్, కొత్తగూడెంలో బీటెక్(మైనింగ్) చేసింది. ఆ తరువాత రాజస్థాన్‌లో శిక్షణ పొందింది. ఇటీవల సింగరేణి ఎక్స్‌టర్నల్ ఉద్యోగాల కోసం నిర్వహించిన పరీక్షల్లో ఉత్తీర్ణురాలై ఉద్యోగం సాధించింది.

మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం..



ఈమె పుట్టపాక సుమ. జగిత్యాలవాసి. తండ్రి తిరుపతి కారు డ్రైవర్. తల్లి భాగ్యలక్ష్మి బీడీ కార్మికురాలు. సుమకు ఒక తమ్ముడు ఉన్నాడు. బీటెక్ చదువుతున్నాడు. జగిత్యాలలో ప్రాథమిక విద్యాభ్యాసం, ఇంటర్ పూర్తి చేసింది. అనంతరం జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ చదివింది. చదువు పూర్తికాగానే పరీక్ష రాసి మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) గా ఉద్యోగం సాధించింది.

ఉన్నత విద్యావంతురాలు



పాపునూక లక్ష్మి సైతం జగిత్యాలవాసే. తండ్రి బుచ్చన్న స్థానికంగా ప్రైవేటుగా పనిచేస్తుండగా, తల్లి గృహిణి. ఇంకా ఇద్దరు చెల్లెల్లు ఉన్నారు. లక్ష్మి ఎస్ఎస్‌సీ, ఇంటర్ జగిత్యాలలో చదువగా, మంథని జేఎన్‌టీయూలో బీటెక్ మైనింగ్ పూర్తి చేసింది. అనంతరం చెన్నై నుంచి ఎంబీఏ చదివింది. ఉద్యోగ ప్రయత్నాల్లో భాగంగా మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్)గా ఉద్యోగం పొందింది.

సమాచారం

రేపు సీఎం కప్ మండల స్థాయి పోటీలు

నెన్నెల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) సీఎం కప్-2024 మండల స్థాయి క్రీడా పోటీలను గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తామని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తెలిపారు. పేర్లు ఆన్‌లైన్ చేసుకొని గ్రామ స్థాయిలో గెలుపొదిన క్రీడాకారులు ఈ నెల 12న 9 గంటల లోపు నెన్నెల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు పీడీ రాజేష్‌ను 70139 89157 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

వేమనపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వేమనపల్లి ఆశ్రమ పాఠశాల ఆవరణలో గురువారం మండల స్థాయి సీఎం కప్ పోటీలను నిర్వహించనున్నామని ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే మండలంలోని వివిధ గ్రామాల క్రీడాకారులు గ్రామపంచాయతీ కార్యదర్శుల వద్ద పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటాం

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని సీపీ ఎం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిషేధాజ్ఞలను జనవరి 1వ తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారి పై భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్- 223), హైదరాబాద్ నగర పోలీస్ చట్టం 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆశిష



ఆశిష

మంచిర్యాల అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మంచిర్యాల పట్టణానికి చెందిన సుదమల్ల ఆశిష ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆశిష పోటీలో నిలిచింది. 4,062 ఓట్లు సాధించడంతో ఆమెను ఖరారు చేస్తూ పార్టీ ఉత్తర్వులను జారీ చేసింది.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, డిసెంబరు 10(ఆంధ్యజ్యోతి): ఉన్నత చదువులు చదివి ఎన్నో కష్టనష్టాలనోర్చి పోలీస్ ఉద్యోగాలు సాధించిన సిబ్బంది ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, నీతి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కమిషనరేట్ సమావేశమందిరంలో కొత్తగా విధుల్లో చేరిన ఏఆర్ కానిస్టేబుళ్లకు ఆయన దిశా నిర్దేశం చేశారు. పోలీస్‌శాఖలో మగ, ఆడ అనే తేడా ఉండదని, పోలీస్ ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్న ఉద్యోగమని, ఎప్పుడూ మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలన్నారు. అధికారులు అప్పగిం చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, క్రమశిక్షణతో పని చేయాలన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. సాయుధ దళాల సిబ్బంది అన్నీ రకాల విధులు నిర్వహించాల్సి వస్తుందని, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినప్పుడు సమయానుకులంగా ఎలా వ్యవహరించా లనేది సీపీ వివరించారు. గార్డ్ డ్యూటీ, వీఐపీలకు, పీఎస్ఓలకు విధులు, బీటీ టీ మ్స్, బాంబు స్క్వాడ్స్, ఎస్కార్ట్ డ్యూటీలు, స్పెషల్ పార్టీ డ్యూటీలు, బందోబస్తు డ్యూటీలు చేసేటప్పుడు ఎలా ప్రవర్తించాలనే విషయాలను వివరించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సుందర్‌రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీని వాస్, మల్లేషం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న డీసీపీ భాస్కర్

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని డీసీపీ భాస్కర్ అన్నారు. నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా రూపొందించిన జంగ్ సైరన్ పోస్టర్లను మంగళవారం డీసీపీ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యంగా నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ సంఘం పోస్టర్లను రూపొందించడం సంతోషంగా ఉందని తెలిపారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటైన యువత సమాజానికి దూరమయ్యే ప్రమాదం ఉంటుందని, స్నేహితులు, బంధువులు దగ్గరకు రానివ్వరని తెలిపారు. డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ సమాజానికి దగ్గరగా ఉండాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు ఉన్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్,నాయకులు కృష్ణ, సతీష్, అదన్‌ఖాన్, శేఖర్, కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ యూనిట్ 2లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

జైపూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని 600 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్-2లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. మంగళవారం సాయంత్రం నుంచి అధికారులు ఉత్పత్తి నిలిపివేసి మరమ్మతులు చేపడుతున్నారు.

బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలి

నస్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం నాయకులు నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు ను ప్రభుత్వ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి జరిగిన సభలో తాము అధికారంలోకి వస్తే బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత బీసీలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్,రాష్ట్ర కార్యదర్శి అక్కల రమేష్, సీనియర్ నాయకులు శాఖపురి భీమేష్, మాదరబోయిన రాజన్న యాదవ్, గేలివాడ వంశీ, షేక్ సల్మాన్, ఆకుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న తపస్ నాయకులు

చెన్నూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టన ధర్మాగ్రహ దీక్ష పోస్టర్లను మంగళవారం చెన్నూరులోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో తపస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా తపస్ జిల్లా అధ్యక్షుడు సయింపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా పెండింగ్ బిల్లులు, పీఆర్‌సీ, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా కాంగ్రెస్ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. దీక్షకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, సమ్మయ్య, హరిణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

101 మందికి కుటుంబ నియంత్రణ చికిత్స

గర్మిళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 101 మంది మగవారికి కుటుంబ నియంత్రణ చికిత్సలు మంగళవారం నిర్వహిం చామని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ ఆస్పత్రిలో 33, బెల్లంపల్లి ఆస్పత్రిలో 38, చెన్నూరులో ఆస్పత్రిలో 30 మందికి కుటుంబ నియంత్రణ చికిత్స నిర్వహించాలమని చెప్పారు. ప్రజలు ముందుకు వచ్చి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కృపాబాయి, సుదాకర్‌నాయక్, అనిత, శ్రీధర్, వెంకటేశ్వర్లు, కాంతారవు, వెంకటేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి: క్రీడలు మానసికోల్లాసానికి, క్రమశిక్షణకు ఎంతగానో అవసరమని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నస్పూర్‌లోని నాగార్జున కాలనీ ప్రాణహిత స్టేడియంలో పట్టణ స్థాయి సీఎం కప్-2024 క్రీడా పోటీలను మంగళవారం కలెక్టర్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే పోటీల్లో వాలిబాల్, ఖోఖో, కబడ్డి, పుట్‌బాల్, యోగా, అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహించారు. అంతకు ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించారు. ఎస్ఆర్ఆర్ లిటిల్ స్టార్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ పోటీలకు హాజరైన క్రీడాకారులను కలెక్టర్ పరిచయం చేసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చదువుతో పాటుగా క్రీడా రంగంలో కూడా ప్రతిభ చూపించి రాణించాలన్నారు. పల్లె నుంచి మొదలై పట్టణం, జిల్లా, రాష్ట్రల్లో క్రీడల్లో పాల్గొని నైపుణ్యత ప్రదర్శించాలన్నారు. క్రీడలతో క్రమశిక్షణ, శరీరధారుఢ్యం, పట్టుదల లభిస్తుందని కలెక్టర్ చెప్పారు. శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రీడల పట్ల ఆసక్తిని మరింతగా పెంపొందించుకోవాలన్నారు. చదువు శ్రద్ధ వహించడంతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని కనబర్చలన్నారు. విద్యా, క్రీడ రంగాల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం మూడు రోజుల పాటు జరిగే క్రీడా పోటీల్లో భాగంగా కబడ్డీ జట్ల మధ్య కలెక్టర్ టాస్ వేసి ప్రారంభించారు. బాలుర కబడ్డీ జట్లు-12, బాలికల జట్లు-8, వాలిబాల్ బాలుర-6, బాలికల-4, తొలి రోజు పోటీల్లో తలపడ్డాయి. కార్యక్రమంలో డీవైఎస్ఓ రాజ్‌వీర్, మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమీషనర్ చిట్యాల సతీష్, మండల విద్యాధికారి దామోదర్ రావు, తహసిల్దార్ శ్రీనివాస్, ఎస్సై నెల్కి సుగుణాకర్, 12, 13 వార్డుల కౌన్సిలర్లు బొద్దున సంధ్యారాణి-రాంమూర్తి, తోట శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు విఠల్, జ్యోతి, శేఖర్, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెట్లు బత్తిని దేవన్న, రేగల్ల ఉపేందర్, మైదం రామకృష్ణ, సత్యనారాయణ, అప్పని తిరుపతి, విష్ణువర్ధన్ రెడ్డి, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రతిభ వెలికి తీసేందుకే..

దండేపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందని లక్షెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్‌లు అన్నారు. మంగళవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనినిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి పోటీలను మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య, ఎస్సై ఉదయ్‌కిరణ్‌తో కలిసి వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గడ్డం త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వభూమిని ఆక్రమించిన వారిపైచర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని కసాబ్‌వాడీ కాలనీలో ప్రభుత్వభూమిని ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఉమేందర్, వెంకటేష్ మాట్లాడుతూ కాలనీలో కవాల్కర్ వినోద్ అనే వ్యక్తి తనఇంటి హద్దులు దాటి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్రహరీని నిర్మిస్తున్నాడన్నారు. దీంతో కాలనీలో రోడ్డు ఇరుకుగా మారి ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు వెంటనే నిర్మాణాన్ని నిలిపివేసి కాలనీ వాసులకు న్యాయం చేయాలనికోరారు. కార్యక్రమంలో గంగయ్య, ఉష, విజయలక్ష్మి పాల్గొన్నారు.

షేక్ మక్దూంపై పీడీ యాక్టు నమోదు



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు

ఆసిఫాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జైనూరు మండలంలో ఆగస్టు31న ఆదివాసీ మహిళపై అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన షేక్‌మక్దూంపై పీడీయాక్టును నమోదు చేసినట్లు ఎస్పీడీవీశ్రీనివాస్‌రావు తెలిపారు. మక్దూంపై పీడీయాక్టు నమోదుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో పీడీయాక్టు అడ్వయిజరి బోర్డుసభ్యులు నవంబరు29న ఆమోదం తెలిపారన్నారు. మంగళవారం ప్రభుత్వం మక్దూంపై పీడీ యాక్టు అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడిన వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామన్నారు.

రామాలయంలో కలెక్టర్ దంపతుల పూజలు



కలెక్టర్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న ఆలయకమిటీ సభ్యులు

ఆసిఫాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ కోదండ రామాలయంలో మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే దంపతులు తమ పెళ్లిరోజును పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు వారికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ దంపతులను ఆలయకమిటీసభ్యులు సత్కరించి మెమోంటోను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు సత్యనారయణ, డాక్టర్ రమేష్, రవి, గిరి, శైలేందర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీ బస్సుల్లో రాయితీ

ఆసిఫాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): టీజీఆర్టీసీ అన్ని ఏసీ బస్సుల బెసిక్ టికెట్‌చార్జీలపై 10శాతం రాయితీని ప్రకటించగా ఈనెల6నుంచే అమల్లోకి వచ్చిందని డిపో మేనేజర్ విశ్వనాథ్ తెలిపారు. ఈ రాయితీ ఏసీ స్లీపర్, ఏసీసీటర్, రాజధాని బస్సులకు వర్తిస్తుందని తెలిపారు. ప్రయాణికులు ఈరాయితీలను సద్వినియోగం చేసుకోవాలని పూర్తి వివరాల కోసం ప్రయాణికులు www.tgsrtcbus.in వెబ్‌సైట్‌ను లాగిన్ కావాలన్నారు.

రక్తదానం మహాదానం



సర్టిఫికేట్ అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాలకెల్లా రక్తదానం గొప్పదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రాజస్థాన్ భవన్‌లో మార్వాడి యువమంచ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం సందర్భంగా ఆయన మాట్లాడారు. రక్తదానం చేయటం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులను కాపాడవచ్చన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన మార్వాడి యువమంచ్ సభ్యులను అభినందించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో మార్వాడి యువమోర్చా అధ్యక్షుడు అరుణ్ లోయా, వైద్యుడు గిరిధర్‌లాల్ ముందడ, అభిషేక్, శుభం లోయా, మురళిజవార్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖ్ రంగస్వామి, శివగౌడ్, రాజేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

పెంచికల్‌పేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపుకలెక్టర్ ఎం డేవిడ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాలవర్షాల నేపథ్యంలో రైతులకు అవసరమైన టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని ఆదే శించారు. ఆయనవెంట డీఆర్డీవో దత్తరాం,తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీవో ఆల్బర్ట్ ఉన్నారు.

దహెగాం: మండల కేంద్రం, కల్వాడ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపుకలెక్టర్ ఎం డేవిడ్ పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో దత్తరాం, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో రాజేందర్ ఉన్నారు.

దాతల సహకారంతో రోడ్డుకు మరమ్మతు



రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న గ్రామస్థులు

పెంచికల్‌పేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మురళీగూడ గ్రామంలోని ప్రధానరహదారి రాళ్ల రప్పలతో అధ్వానంగా మారింది. దీంతో గ్రామస్థుల సహకారంతో రోడ్డుకు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి బీటీరోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరారు. కార్యక్రమంలోగ్రామస్థులు మధుకర్, ప్రభాకర్, జగదీష్, రామయ్య, గురుదాస్ పాల్గొన్నారు.

పులి మహారాష్ట్రకు వెళ్లిపోయింది: ఎఫ్‌డీవో

సిర్పూరు(టి), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సిర్పూరు(టి)రేంజ్‌పరిధిలో మంగళవారం హుడ్కిలి గ్రామంలో కట్టి ఉన్న గేదెపై పులి దాడిచేసి మహారాష్ట్రలోని అంతర్‌గాం అడవిలోకి వెళ్లినట్టు ఎఫ్‌డీవోసాహు తెలిపారు. కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. తాము అన్నికోణాల్లో విచారణ జరిపుతున్నట్లు తెలిపారు. పులిఅడుగులను గుర్తించి అది మహారాష్ట్రకు వెళ్లినట్టు తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. ఆయనవెంట సిర్పూరు(టి) ఎఫ్ఆర్వో ఎక్బాల్ హుస్సేన్ తదితరులున్నారు.

సైబర్ నేరస్థుల వలకు చిక్కవద్దు

సిర్పూర్(యు), డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): రైతులు, బ్యాంకు ఖాతాదారులు సైబర్‌నేరాల వలకు చిక్కకూడదని నాబార్డ్ ఎఫ్‌ఎల్‌సీ కన్సల్టెంట్ రాంరెడ్డి కోరారు. మండలంలోని నీలాగోందిలో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతు రైతులకు గ్రామగ్రామాన వెళ్లిబ్యాంక్‌ఖాతాలు తెరచుకునేలఅవగాహన కల్పిస్తున్నామన్నారు. సైబర్‌మోసగాళ్లపట్ల అప్రమత్తంగాఉండాలని సూచించారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు



- అర్హుల ఎంపికకు ప్రత్యేక యాప్
- జిల్లాలో 1,54,136 దరఖాస్తులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు రంగం సిద్ధమైంది. పారదర్శకంగా ఎంపిక చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల మేనిఫెస్టో అమలులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. లబ్ధిదారుల ఎంపికకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల5న ప్రత్యేకయాప్‌ను ఆవిష్కరించారు. దీంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. - ఆసిఫాబాద్‌రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తోంది. ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రైతులకు రుణమాఫీ, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం, రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ పథకాలను ప్రారంభించింది. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దీంతో ఎన్నోఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకల సాకారం కానుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందుగా ఇంటిస్థలం ఉన్న వారికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. ఒక్కో లబ్ధిదారు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5లక్షలు ఇవ్వనుంది. నిర్మాణదశలను అనుసరించి నాలుగు విడతల్లో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయనుంది.

జిల్లాకు 7వేల ఇళ్లు కేటాయింపు..

ప్రజాపాలనలో జిల్లావ్యాప్తంగా 15మండలాల్లోని 335పంచాయతీల పరిధిలో వివిధ పథకాల కోసం 1,63,647 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 1,54,136దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో సొంతస్థలం ఉన్న నిరుపేదలకు తొలిప్రాధాన్యత ఇవ్వనున్నారు. ముఖ్యంగా ఆదివాసీ గిరిజనులు, దళితులు, పారిశుధ్య కార్మికులు, వ్యవసాయ కూలీలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు ముందుగా ఇళ్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలకు 3500చొప్పున జిల్లాలకు 7వేల ఇళ్లు మంజూరు కానున్నాయి.

యాప్ ద్వారానే గుర్తింపు..



ప్రభుత్వం యాప్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించనుంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇందిరమ్మ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని వివరాలు నమోదు చేయాలి. దరఖాస్తుదారు పేరు, ఆధార్ నెంబర్, సంవత్సర ఆదాయం, సొంత స్థలం, ఇప్పటివరకు ఇందిరమ్మ పథకం కింద లబ్ధిపొందారా తదితర 35రకాల ప్రశ్నలకు సమాధానాలు యాప్‌లో నమోదు చేయాలి. దరఖాస్తుదారులకు ఫోన్‌లేని పక్షంలో అధికారులు ఇంటికి వచ్చినపుడు వివరాలు తెలియజేయాలి. యాప్‌లో ఏఐ టెక్నాలజీని ఉపయోగించి దరఖాస్తుదారు ముఖం, ఇళ్లు నిర్మించే భౌగోళిక అక్షాంశాలు, రేఖాంశాల వివరాలు నమోదు చేస్తారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిని కూడా ఎప్పటికప్పుడు ఏఐ ఆధారంగా ఫొటోలు తీస్తారు. ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా మున్సిపాలిటీల్లో ముఖ్య ప్రణాళిక అధికారుల ఆధ్వర్యంలో, గ్రామపంచాయతీల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు.

ప్రతి మండల కేంద్రంలో నమూనా ఇళ్లు..

లబ్ధిదారులు తమకున్న స్థలాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఇళ్లు నిర్మించుకునేలా ప్రతి మండలకేంద్రంలో ఒకనమూనా ఇంటిని నిర్మించనున్నారు. ఈ మేరకు గృహనిర్మాణశాఖకు సంబంధించి జిల్లాకు ఒక డీఈ, ఏఈ, సీఎల్‌టీసీని నియమించింది. వారు నమూనా ఇంటి నిర్మాణ కోసం జిల్లాలోని అన్ని మండలాల్లోస్థలాలు పరిశీలించి సిద్ధం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలను 13లోగా తెలియజేయాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్‌కేంద్రాలపై అభ్యంతరాలను ఈనెల13లోగా తెలియజేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీపీవో భిక్షపతిగౌడ్‌తో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సాధారణ ఎన్నికల నిర్వహణకు అన్నిచర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని 335గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 2874వార్డులు న్నాయని అందుకు సరిపడాసిబ్బంది వివరాలు సేకరించామన్నారు. పోలింగ్‌కేంద్రాల వివరాల ముసాయిదా ఈనెల6న గ్రామ పంచాయతీల్లో ప్రచురించామన్నారు. 12న ఎంపీడీవో కార్యాలయాల్లో రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా ఈనెల13 లోగా తెలియజేయలన్నారు. సమావేశంలో ఆయారాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలి..



ఏటీఎంను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎంను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. మంగళవారం ఎస్‌బీఐ ఆర్ఎం రితేష్‌కుమార్ గుప్తాతో కలిసి ఏటీఎంను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ఏటీఎం ఉద్యోగులకు, అధికారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్‌మేనేజర్ విజయ్‌భాస్కర్, లీడ్‌బ్యాంకు డిస్ట్రిక్‌మేనేజర్ రాజేశ్వర్‌జోషి, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, డీడబ్ల్యూవోభాస్కర్, ఎస్సీకార్పొరేషన్ అధి కారి సజీవన్, బ్యాంకుమేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

జాతర పోస్టర్లు విడుదల

జైనూరు, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెతవిశ్వనాథ్ చేతుల మీదుగా ఆదివాసులు భీమయ్యక్ జాతర పోస్టర్లను విడుదల చేశారు. ఆసిఫాబాద్ మండలంలోని సేకన్‌గొంది అటవీ ప్రాంతంలో ఈనెల12, 13తేదీల్లో పూజలు నిర్వహించి జాతర ప్రారంభిస్తామని మూడు మండలాల కొలాం సంఘం అధ్యక్షుడు ఆత్రంరాజు తెలిపారు. కార్యక్రమంలో కొలాంసంఘం మూడు మండలాల గౌరవ అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మండాడి లింగు, కనకగంగారాం, భుజంగ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో మెనూ పాటించాలి

కెరమెరి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ హాస్టళ్లలో మెనూ పాటించాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. మండలంలోని బాబేజరి గిరిజ సంక్షేమ వసతిగృహాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మూడు పూటల నాణ్యమైన భోజనం అందజేయాలని సూచించారు. మెనూ పాటించని హాస్టళ్లపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మెనూను పరిశీలించారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఐసీడీఎస్ పీడీ భాస్కర్

రెబ్బెన, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీడీ భాస్కర్ తెలిపారు. మగళవారం మండలంలోని గంగాపూర్ గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలమేళ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడునుంచి ఐదుసంవత్సరాల పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించటంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తామన్నారు. గర్భిణులకు ఒకపూట భోజనం కూడా అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ సీడీపీవో సాదియా రుక్సానా, సూపర్‌వైజర్లు కళావతి, విజయ, మాజీఎంపీటీసీ హరిత, అంగన్‌వాడీ టీచర్లు సుష్మా, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



రిలే దీక్షలో కూర్చున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. ఉద్యోగుల దీక్షకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులను వెంటనేరెగ్యులర్ చేయాలని, తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 20సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నామన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో జీవనోపాధి కష్టమవు తోందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనాన్ని అమలు చేయాలన్నారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రశిక్షఉద్యోగుల సమస్యలు ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. సమ్మె చేపడుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, గెజిటెడ్‌హెచ్‌ఎంల సంఘం జిల్లాఅధ్యక్షుడు లతీఫ్, పీఆర్టీయూ నాయకులు అనిల్ కుమార్ తదితరులు మద్దతుతెలిపారు. దీక్షల్లో ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగుల సంఘంజిల్లా అధ్యక్షుడు శృతిక, ప్రధానకార్యదర్శి తుకారాం, మోహన్, నగేష్, సంతోష్, పద్మ, సందీప్, రాజేష్, పవన్, అనూప్,ప్రశాంత్,వెంకట రమణ, రాము, మల్లేష్, సత్యనారయణ,సంతోష్, తదితరులున్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



బైక్‌ర్యాలీని ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఆసిఫాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఒడ్డెపల్లిగార్డెన్‌లో మంగళవారం బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో 100రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలుచేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్‌ప్రభుత్వం ఏడాది గడిచినా ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ గ్యారంటీల గారడీ ఆరు అబద్ధాలు.. 66 మోసాలు.. అని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేకవిధానాలను ఎండగట్టేందుకు జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో ప్రజాయాత్రలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందుపట్టణంలో బైక్‌ర్యాలీని జెండాఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, అరిగెల మల్లికార్జున్ యాదవ్, కొట్నాకవిజయ్‌కుమార్, ఖాండ్రేవిశాల్, సిద్దం శెట్టి సుహాసిని, సొల్లులక్ష్మి,జయరాజ్, అంజనేయులుగౌడ్, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లిని అవమానించిన కాంగ్రెస్

ఆసిఫాబాద్/రెబ్బెన/బెజ్జూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ప్రభుత్వం తెలంగాణతల్లిని అవమానించిందని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం జిల్లావ్యాప్తంగా తెలంగాణతల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తినిచ్చిన తెలంగాణతల్లి విగ్రహాన్ని మార్చివేసి తెలంగాణ ఆత్మగౌరవాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కించపరచారని ఆరోపించారు. కేవలం సోనియాగాంధీ మెప్పుకోసమే కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. రాబోయేరోజుల్లో కాంగ్రెస్‌పార్టీకి ప్రజలు తగినబుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండోచైర్మన్ అలీబీన్‌అహ్మద్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు చిలూవేరి వెంకన్న, మర్సుకోల సరస్వతి, అజయ్, నిసార్, భీమేష్, గందం శ్రీనివాస్, అన్సార్, సాజిద్, రవి, అహ్మద్, రాజ్‌కుమార్, బలరాం, ఆశన్న,దూడలఆశోక్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



రెబ్బెనలో.. తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం..

రెబ్బెన గోలేటి గ్రామపంచాయతీలో, బెజ్జూరు మండలకేంద్రంలో బస్టాండ్ ఆవరణలో బీఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెలంగాణతల్లి విగ్రహం ఏర్పాటు చేయటం సరైంది కాదన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్: ఈనెల 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌ల ద్వారా సత్వరన్యాయం జరుగుతుందని రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు.

సీఎం కప్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలి

వాంకిడి: మండలకేంద్రంలో గురువారం నిర్వహించేసీఎంకప్ క్రీడాపోటీలను విజయవంతం చేయాలని తహసీల్దార్ రియాజ్‌అలీ, ఎంపీడీవో ప్రవీణ్ కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తామన్నారు.

రెబ్బెన: క్రీడాస్ఫూర్తితో క్రీడాకారులు రాణించాలని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి క్రీడామైదానంలో సీఎం కప్ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకరావాలన్నారు.

జైనూర్: విద్యార్థులు క్రీడలతోపాటు చదువులోనూ రాణించాలని జైనూర్ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. జిల్లా పరిషత్ సెకండరీ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జీ తహసీల్దార్ అడబీ ర్రావ్, సీఐరమేష్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంఈవో మధుకర్‌తో కలిసి జెండా ఊపి సీఎంకప్ క్రీడాపోటీలను ప్రారంభించారు.

కెరమెరి: మండలంలో సీఎంకప్ క్రీడలను ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్‌రావుతోకలిసి ప్రారంభించారు.

సిర్పూర్(యు): మండలకేంద్రంలో సీఎంకప్ క్రీడలను ఎంపీడీవో కిష్టారావ్, ఎంఈవోసుధాకర్, తహసీల్దార్ తదితరులు ప్రారంభించారు.కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్ బాబు, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, ఆదిలాబాద్ కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ, ఎస్ఐ రామకృష్ణ, సీఐ రమేష్ పాల్గొన్నారు.

లింగాపూర్: మండలకేంద్రంలో సీఎం కప్ క్రీడలను ఎస్ఐ గంగన్న, ఇన్‌చార్జీ ఎంపీడీవో కృష్ణారావ్, ఇన్‌చార్జీ ఎంపీవో రజనీకాంత్ రెడ్డి, తదితరులు పచ్చజెండా ఊపి ప్రారంభించారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబాపూర్ మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి కరాటేపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల కాగజ్‌నగర్‌లో జరిగిన జిల్లాస్థాయి కరాటే పోటీల్లో సైదం శైలజ, అక్షయ, మేఘన గోల్డ్‌మెడల్ సాధించగా, అంజలి, తేజరాణి, రచనశ్రీ, ప్రశంస, నందిని, అభినయ సిల్వర్‌మెడల్ పతకాలను సాధించారు. క్రీడల్లో ఉత్తమప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రత్నబాయి, సిబ్బంది అభినందించారు.

ప్రమాణ స్వీకారానికి తరలిరావాలి

బెజ్జూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈనెల19న కాగజ్‌నగర్‌లోని వాసవీ గార్డెన్‌లో నిర్వహించే జిల్లా నూతన ఆర్యవైశ్య కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ మహాసభకు తరలిరావాలని మండల ఆర్యవైశ్య గౌరవఅధ్యక్షుడు రాచకొండ శ్రీవర్దన్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు పుల్లూరి సతీష్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య మహాసభ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగనాయక ఆలయకమిటీ అధ్యక్షుడు తంగడిపల్లి మహేష్, వైశ్యసంఘం నాయకులు నేరెల్ల సంతోష్, బోగ రమేష్, మిర్యాల వెంకటరమణ తదితరులు ఉన్నారు.